సాక్షి జనగామ

శుక్రవారం । 20 । జూన్ । 2025



కలహాల కాంగ్రెస్...

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు మరోసారి భగ్గుమన్నాయి. అవి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వ్యాఖ్యలతో బట్టబయలయ్యాయి. - 10లో▸



అడవి నుంచి.. పుడమితల్లి ఒడికి

గాజర్ల రవి బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరగగా నాటి ఉద్యమకారులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. నేడు అంత్యక్రియలు జరగనున్నాయి. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఆస్పత్రి నుంచే ప్రజా సమస్యలపై ఆరా ..



జనగామ: ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో జారిపడి గాయపడిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రజాసమస్యలపై ఆరా తీస్తున్నారు. గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను పరిశీలించి సంతకాలు చేశారు. తాను ఏ పరిస్థితుల్లో ఉన్నా ప్రజలకు అవసరమైన సేవలు అందించడమే తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకు ముందు ఆస్పత్రిలో పల్లాను మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడూరు గ్రామంలో రూ.49 లక్షలతో చేపట్టిన మసీదు ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ మదార్, గ్రామ అధ్యక్షుడు దేవేందర్, సేవాదళ్ రాష్ట్ర నాయకుడు గుగ్గిళ్ల ఆదినారాయణ, మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, ఎండీ.అబ్బాస్‌అలీ, ఎండీ.సలీం, శంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జనగామ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 21న ఉదయం 7 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి సూచించారు. యోగాపై అవగాహన అవసరమని, ప్రస్తుత జీవనశైలిలో ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా మంచి సాధనమని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ రహిత జనగామ పట్టణమే లక్ష్యం

జనగామ: ప్లాస్టిక్ రహిత జనగామ పట్టణమే లక్ష్యమని, ఇందులో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాణిజ్య, వ్యాపార, పరిశ్రలు, గృహ, గృహేతర అన్ని వర్గాల ప్రజలు ప్రమాదకరమైన ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని సూచించారు. ప్లాస్టిక్ (అన్ని రకాలు) విక్రయించిన వారికి రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధించనున్నట్లు కమిషనర్ తెలిపారు. అవసరమైతే దుకాణాన్ని సీజ్ చేసి, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ కేంద్రం ద్వారా 2026 సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ కోచింగ్ నిమిత్తం ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 100 మంది ప్రతిభావంతులను జూలై 12న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తామని చెప్పారు. మరో 50 మందిని గతంలో సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత పత్రాలతో నేరుగా టీజీ బీసీ స్టడీ సర్కిల్, రోడ్ నంబర్ 8, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ 500059 అడ్రస్‌కు జూలై 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశం పొందిన వారికి బోర్డింగ్, రవాణా సౌకర్యం నిమిత్తం నెలకు రూ.5,000 స్టైఫండ్, రూ.5,000 బుక్ ఫండ్ ఒకసారి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయ సదుపాయం కల్పిస్తారని, మరిన్ని వివరాలకు 040–29303130, 04024071178, 7780359322, హనుమకొండ 0870–2571192 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మూడేళ్లుగా మూత'బడి'



తరిగొప్పుల: అబ్దుల్‌నాగారం శివారు వాల్యతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక మూడేళ్ల క్రితం మూసివేశారు. ఇందులో పనిచేసే టీచర్ డిప్యూటేషన్‌పై అబ్దుల్‌నాగారం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ 56 మంది విద్యార్థులు ఉండగా మరుగుదొడ్లు లేవు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగడం లేదు.

సమస్యల నిలయం శివునిపల్లి పీఎస్

స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లి పీఎస్ సమస్యలకు నిలయంగా మారింది. మూడేళ్ల క్రితం 'మన ఊరు –మన బడి' కింద పనులు చేపట్టే సమయంలో ఉన్నత పాఠశాల మొదటి అంతస్తు తరగతి గదుల్లో 46 మంది ప్రాథమిక విద్యార్థులకు బోధన సాగిస్తున్నారు. తలుపులు, కిటికీలు తొలగించి వదిలేశారు. పిల్లలు మొదటి అంతస్తుకు వెళ్లడం.. కిందికి దిగడం ప్రమాదకరంగా మారింది. మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.



అధ్వానంగా ఉన్న టాయిలెట్లు

చెట్ల కిందే చదువులు



రఘునాథపల్లి: కుర్చపల్లి ప్రాథమిక పాఠశాలలో 46 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల స్కీం కింద తరగతి గదుల స్లాబ్ తొలగించి రేకుల నిర్మాణం చేపట్టారు. ఫ్లోరింగ్ చేయకపోగా ట్యాంకు, కిటికీలకు తలుపులు బిగించలేదు. టాయిలెట్లు లేక విద్యార్థులు బయటకు వెళ్తున్నారు. పైకప్పు రేకులు వేయడంతో ఉక్కపోత భరించలేక విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెడుతున్నారు.

శిథిల గదులు.. చదువులు ఆగం

విరిగిన తలుపులు.. ఊడిపోయే కుళాయిలు

- ఫైకప్పులకు రేకులు.. సపోర్టుగా కర్రలు
- క్వాలిటీ కంట్రోల్ లేకుండానే బిల్లుల చెల్లింపు
- 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులపై పర్యవేక్షణ కరువు
- ఆదరణ లేక మూతపడిన పాఠశాలలు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి అనేక సమస్యలు

జనగామ: 'మన ఊరు – మన బడి' కార్యక్రమాన్ని గాలికి వదిలేశారు.. 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పేరిట కొత్త స్కీం తీసుకువచ్చి పాత పనులు పట్టించుకోకుండా.. కొత్త నిర్మాణాలపై దృష్టి సారించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు మట్టిపాలు కాగా.. కాంగ్రెస్ సర్కారు తెచ్చిన పథకం కాంట్రాక్టర్లకు వరంగా మారింది. టాయిలెట్ల తలుపులు ఇప్పుడే విరిగి పోతుంటే.. ట్యాపులు ముట్టుకుంటే ఊడిపోయేలా ఉన్నాయి. భవనాల పైపెచ్చులు ఊడిపోయి.. ప్రహరీలు కూలిపోయి కొన్ని బడులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 508 ఉండగా, సుమారు 32వేల మంది చదువుకుంటున్నారు. విద్యార్థులు లేక సుమారు 65 పాఠశాలలు మూతపడగా ఒకటో తరగతి చదువుకునే పిల్లలు సుదూర ప్రాంతాలకు నడిచి వెళ్లే పరిస్థితి నెలకొంది. గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.



జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట పాఠశాలలో ధ్వంసమైన టాయిలెట్లు

టాయిలెట్లు లేని తిమ్మంపేట పాఠశాల

జాఫర్‌గడ్: తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కొన్నేళ్లుగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి. దీనికి తోడు తరగతి గదుల తలుపులు, కిటికీలు దెబ్బతినడంతో భద్రత లేకుండా పోయింది. వరండా, తరగతి గదుల్లోని బండలు కుంగిపోయాయి. భవనం పైపెచ్చులు ఊడి పోతున్నాయి. ప్రహరీ సైతం పలుచోట్ల కూలిపోయింది. దీంతో పాఠశాల మందుబాబులకు అడ్డగా మారింది.

టాయిలెట్లు నిర్మించాలి



తమ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలి. బయటకు వెళ్లాల్సి వస్తుంది. పాఠశాల తరగతి గదులకు తలుపులు, కిటికీలు లేవు. ప్రహరీ పలుచోట్ల కూలింది. ఈ సమస్యలు పరిష్కరించాలి.

– కడబోయిన హరిప్రసాద్, 10వ తరగతి

పడిపోయిన పాఠశాల గ్రేడ్



దేవరుప్పుల: మున్‌పహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల నేడు ప్రాథమిక స్థాయికి పడిపోయింది. స్కూల్‌లో ఏడుగురు పిల్లలే ఉన్నారు. పాత గదుల్లోనే బోధిస్తున్నారు. వదిలేసిన నూతన గదులు అసాంఘిక కార్యక్రమాలకు కేంద్ర బిందువయ్యాయి.

'ప్రైవేట్'పై మోజుతోనే..



సకల సౌకర్యాలతో ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తున్నా పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు. దీంతో సర్కారు చదువు దెబ్బతింటోంది.

– జ్ఞానానంద కీర్తి, టీచర్, మున్‌పహాడ్

ఒకటో తరగతి ఎలా..



బచ్చన్నపేట: సదాశివపేట ప్రాథమిక పాఠశాలలో ఇంతకు ముందు 20 మంది విద్యార్థులు చదువుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతో ఈ స్కూల్‌ను మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఒకటో తరగతి చదివే పిల్లలను తల్లిదండ్రులు రోజూ మండల కేంద్రానికి తీసుకురావడం, సాయంత్రం తీసుకువెళ్లడం ఇబ్బందిగా మారింది.

ఆటో అద్దె ఏడాదికి రూ.30వేలు



ముగ్గురు కూతుళ్లను మండల కేంద్రంలోని పాఠశాలకు పంపించేందుకు ఆటో అద్దె ఏడాదికి రూ.30వేలు చెల్లిస్తున్నాను. గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ కూడా లేదు. వ్యవసాయంపై ఆధారడే మా కుటుంబం ఆటో అద్దె చెల్లించడం పెద్ద కష్టంగా మారింది.

– ఎ.కృష్ణమూర్తి, విద్యార్థి తండ్రి, సదాశివపేట

ఒక టీచర్.. ఇద్దరు పిల్లలు



జైత్యాతండా ఎంపీపీఎస్

స్టేషన్‌ఘన్‌పూర్: చంద్రుతండా (జైత్యాతండా) జీపీ పరిధి ఎంపీపీఎస్ పాఠశాలలో 3, 5వ తరగతి సంబంధించి ఒక్కో విద్యార్థి ఉన్నారు. హెచ్‌ఎం సీహెచ్.రమేశ్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ మోజులో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపకపోవడంతో ఆ పాఠశాల పరిస్థితి 'ఒక్క టీచర్.. ఇద్దరు స్టూడెంట్స్' అన్న చందంగా మారింది. ఇదిలా ఉండగా.. చంద్రుతండా జీపీ పరిధిలో ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడితో నడిచిన మాన్‌సింగ్‌తండా పాఠశాల గత విద్యాసంవత్సరం మూతపడింది.

అసంపూర్తి చదువులు



కదగుట్టతండా ప్రాథమిక పాఠశాలలో..

కొడకండ్ల: కదగుట్టతండా ప్రాథమిక పాఠశాలలో 13 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఉన్నారు. పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో ఒక టీచర్‌ను మేఘ్యతండా పీఎస్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. 'మన ఊరు – మనబడి' కింద రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా, పాత భవనాన్ని తొలగించి కొత్త తరగతి గదుల కోసం స్లాబ్ వేసి చేతులు దులుపుకున్నారు.

ముగిసిన 'బడిబాట'

- కొత్తగా 2,605 మంది విద్యార్థుల చేరిక
- రఘునాథపల్లి టాప్.. చివరలో కొడకండ్ల
- రోజువారీగా మరింత మంది చేరే అవకాశం

జనగామ: సర్కారు స్కూళ్లలో అడ్మిషన్లు పెంచుకునేందుకు ఈనెల 6న ప్రారంభించిన జయశంకర్ 'బడిబాట' గురువారంతో ముగిసింది. జిల్లాలో 14 రోజులపాటు 'బడిబాట' కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు డీఈఓ భోజన్న నాయకత్వంలో టీచర్లు ఇంటింటికీ వెళ్లారు. గ్రామ సభల నుంచి మొదలు చివరి రోజు క్రీడా పోటీలతో ముగింపు పలికారు. జిల్లాలో నూతన అడ్మిషన్లు 2,605 వరకు రాగా, ఇందులో రఘునాథపల్లి మండలం 490 మంది పిల్లలతో టాప్‌లో నిలువగా, రెండో స్థానంలో జనగామ–445, కొడకండ్ల 83 మందితో చిట్ట చివర స్థానంలో నిలిచింది. కాగా మరో నెల పాటు కొత్త అడ్మిషన్లు వచ్చే అవకాశం ఉందని ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

పండుగ వాతావరణంలో

నర్మెట్ట మండలం మాన్‌సింగ్ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, స్కిప్పింగ్ తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పగిడిపల్లి దామోదర్, ఉపాధ్యాయులు రావుల రామ్మోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



నర్మెట మండలం మాన్‌సింగ్ తండా పీఎస్‌లో చివరిరోజు ఆటల పోటీల్లో పాల్గొన్న బాలికలు

'బడిబాట'లో చేరిన పిల్లల వివరాలు

మండలం	కొత్త అడ్మిషన్లు	మండలం	కొత్త అడ్మిషన్లు
బచ్చన్నపేట	148	కొడకండ్ల	83
చిల్పూరు	125	లింగాలఘణపురం	130
దేవరుప్పల	218	నర్మెట	146
స్టేషన్‌ఘన్‌పూర్	160	పాలకుర్తి	216
జనగామ	445	రఘునాథపల్లి	490
		తరిగొప్పల	110
		జఫర్‌గఢ్	334

'భూభారతి' దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: 'భూభారతి' దరఖాస్తులను అధికారులు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో భూభారతి, జాతీయ కుటుంబ లబ్ధి పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్) సన్న బియ్యం, బీఎల్‌ఓలకు శిక్షణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి దరఖాస్తుల విషయంలో వాస్తవాలను పరిగణలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. సర్వే నంబర్ మిస్ మ్యాచ్ అయితే నోటీసు ఇవ్వాలని సూచించారు. సాదాబైనామా, అసైన్డ్ లాండ్‌లను దశల వారీగా పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో జాతీయ కుటుంబ లబ్ధి పథకానికి వచ్చిన దరఖాస్తులను మండలాల వారీగా విభజించి నివేదిక అందించాలని సూచించారు. సన్న బియ్యం పంపిణీ వేగంగా చేపట్టేందుకు డీలర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చేందుకు మండల స్థాయిలో అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓలు గోపీరామ్, డీఎస్ వెంకన్న, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంతు నాయక్, జిల్లా సివిల్ సప్లయీస్ డీఎం హతిరామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

ఆర్థిక వనరుగా ఇందిరా మహిళా శక్తి పథకం

బచ్చన్నపేట: రాష్ట్రంలో కోటి మంది మహిళా మణులను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ఈ పథకం మహిళలకు ఆర్థిక వనరుగా దోహదపడుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బచ్చన్నపేట మండలం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన వనిత టీ స్టాల్‌ను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన యూనిట్లను ప్రారంభిస్తామని చెప్పారు. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలుగా కొనసాగుతున్న పోచన్నపేటకు చెందిన రేణుక రచన మహిళా సమాఖ్య ద్వారా రూ.2 లక్షలు ఋణం పొంది వనిత టీ స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిమాండ్‌కు తగినట్టుగా వ్యాపారం పెంచుకోవాలని సూచించారు. డీఆర్డీఓ వసంత, మండల స్పెషల్ అధికారి రామారావు నాయక్, ఎంపీడీఓ మల్లికార్జున్, డీటీ ఫణికుమార్ పాల్గొన్నారు.



టీ స్టాల్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

డ్రగ్స్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: డ్రగ్స్‌పై విద్యార్థులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. గురువారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన డీఏడబ్ల్యూఎన్ డ్రగ్ ఫ్రీ ఇండియా స్కీమ్–2025పై పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జడ్జి మాట్లాడారు. మాదక ద్రవ్యాలు ఎలా తయారవుతాయి, అవి మనుషులపై ఎలా ప్రభావం చూపుతాయి.. వాటికి యువత ఎలా బానిసలవుతారు.. మదకద్రవ్యాలు అమ్మేవారు చిన్నపిల్లలను ఎలా టార్గెట్ చేస్తున్నారు.. వారిని ఏ విధంగా బానిసలను చేస్తున్నారు.. అనే అంశాలపై వివరించారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడొద్దని, తినే వస్తువులు ఇస్తే తీసుకోరాదని సూచించారు. మాదకద్రవ్యాలు.. చాక్లెట్లు, స్టిక్కర్లు ఏరూపంలోనైనా ఉండొచ్చని, జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. అపరిచితులు ద్విచక్ర వాహనాలపై లిఫ్ట్ ఇస్తానంటే వెళ్లొద్దని, ముఖ్యంగా బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ఎంఈఓ శంకర్‌రెడ్డి, పీఎల్‌వీ జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

సర్కారు స్కూల్‌లో హెచ్‌ఎం కుమారుడు



తన కుమారుడిని స్కూల్‌లో చేర్పించిన హెచ్‌ఎం కృష్ణ

జనగామ రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పసరమడ్ల పాఠశాల హెచ్‌ఎం బండ కృష్ణ కుమారుడిని తాను విధులు నిర్వర్తించే స్కూల్‌లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని, సమాజానికి మంచి సందేశం అందించాలనే తన కొడుకు బండ గరుడ స్కందను ఒకటో తరగతిలో చేర్పించినట్లు కృష్ణ తెలిపారు.

వృత్తి నైపుణ్యం సాధించాలి

- సీపీ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: పోలీస్ అధికారులు అప్పగించిన పనుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యం సాధించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. యూనిట్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డ్యూటీ మీట్‌లో విభాగాల వారీగా రాణించిన కమిషనరేట్ పరిధి పోలీసులను జోనల్ స్థాయిలో నిర్వహించే మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈఏడాది రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ అధికారులు వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా నేరస్తులను త్వరగా గుర్తించడంతో పాటు, ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలమని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, అంకిత్ కుమార్, రాజమహేంద్రనాయక్ అదనపు డీసీపీ రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్‌తో పాటు, జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

అనుమతిలేని వెంచర్లపై చర్య తీసుకోవాలి

- డీపీఓ నాగపురి స్వరూప

తరిగొప్పుల: గ్రామపంచాయతీ పరిధిలో లే అవుట్ వెంచర్లు ఏర్పాటు చేస్తే గ్రామపంచాయతీ అనుమతి తప్పకుండా తీసుకోవాలి.. లేదంటే ఆయా వెంచర్ల యజమానులకు నోటీసులు జారీ చేసి చర్య తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూప స్పష్టం చేశారు. పల్లెప్రగతి యాప్ తనిఖీలో భాగంగా గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతులు ఎలా ఇస్తున్నారని తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ స్వరూప

ఉత్సాహంగా యోగా దినోత్సవం



యోగా చేస్తున్న విద్యార్థులు

జనగామ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం ముందస్తుగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు మాన్యపు సిద్దేశ్వర్ ఆధ్వర్యాన చేపట్టిన యోగా కార్యక్రమంలో 300 మందికి పైగా ఉత్సాహంగా ఉపాధ్యాయులు కిషన్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దూరవిద్య కోర్సుల అడ్మిషన్లకు నోటిఫికేషన్



నోటిఫికేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ డిప్లొమా సర్టిఫికెట్, ఓరియెంటేషన్ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం 2025–2026లో ప్రవేశాలకుగాను నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను వీసీ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని దూరవిద్యకేంద్రం డైరెక్టర్ బి.సురేశ్‌లాల్ తెలిపారు. ఈ నెల 20వ తేదీనుంచి జూలై 31వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. కోర్సులు, ఫీజుల వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, దూరవిద్యకేంద్రం సైన్స్‌కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌ముంజం, డాక్టర్ వి.జగన్, డాక్టర్ కొట్టే భాస్కర్ పాల్గొన్నారు.

అన్నను చంపిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు

కురవి: అన్నను చంపిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై నగేశ్ గురువారం తెలిపారు. సీరోలు గ్రామానికి చెందిన వల్లపు లింగన్న తన భూమిని సమానంగా పంచి ఇవ్వలేదనే కారణంతో అతడి రెండో భార్య కుమారులు నరేశ్, మహేశ్, నరేశ్ భార్య సౌందర్య, లింగన్న రెండో భార్య నర్సమ్మ, నున్న వీరన్న (నరేశ్ బావమరిది) కలిసి లింగన్న మొదటి భార్య కుమారుడు కృష్ణను ఈ 18న కత్తితో నరికి చంపారు. ఈ ఘటనలో మృతుడి తండ్రి లింగన్న ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరునెలలు జైలు

వరంగల్ లీగల్ : అప్పుగా తీసుకున్న రూ.4 లక్షలు చెల్లించని కారణంగా బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో నిందితురాలికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సీహెచ్. శ్రావణస్వాతి గురువారం తీర్పు వెలువరించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బ్రాహ్మణవాడకు చెందిన సుంకరి నరేందర్.. కాజీపేట సిద్ధార్థనగర్‌కు చెందిన యాట భాగ్యలక్ష్మికి 2024, జూన్ 15వ తేదీన రూ.4 లక్షల అప్పు ఇచ్చాడు. ఈ మేరకు భాగ్యలక్ష్మి.. నరేందర్‌కు ప్రామిసరీ నోటు రాసి ఇచ్చింది. రెండు నెలల్లో మొత్తం తిరిగి ఇస్తానని చెప్పింది. అయితే వివిధ కారణాలతో ఇవ్వకుండా సెప్టెంబర్‌లో హనుమకొండలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంబంధించిన రూ.4లక్షల చెక్కు ఇచ్చింది. సదరు డబ్బులు డ్రా చేసే నిమిత్తం నరేందర్ 2024, అక్టోబర్ 10వ తేదీన చెక్కును బ్యాంకులో వేయగా అకౌంట్‌లో సరిపోను డబ్బులు లేవని అధికారులు చెక్కు చెల్లదని తిరిగి ఇచ్చారు. దీనిపై బాధితుడు తన న్యాయవాది బైరి మల్లేశం ద్వారా కోర్టును ఆశ్రయించాడు. విచారించిన కోర్టు.. చెల్లని చెక్కు ఇచ్చిన ఘటనలో నేరం రుజువుకావడంతో నిందితురాలు భాగ్యలక్ష్మికి ఆరు నెలల జైలు శిక్ష, అప్పుగా తీసుకున్న మొత్తం రూ.4 లక్షలకు వడ్డీ, జరిమానా కింద రూ.3 లక్షలు మొత్తం రూ.7 లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించింది.

కలహాల కాంగ్రెస్...

కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలతో బట్టబయలు

- తారస్థాయికి చేరిన కాంగ్రెస్ గ్రూపువార్
- సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా
- ఎమ్మెల్యేలు రేవూరి, కడియంపై సీరియస్ వ్యాఖ్యలు
- ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ రాజకీయ దుమారం
- తాజా పరిస్థితులపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా?



కడియం శ్రీహరి



కొండా మురళీధర్‌రావు



రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్ : కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు మరోసారి భగ్గుమన్నాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వ్యాఖ్యలతో బట్టబయలయ్యాయి. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా గురువారం వరంగల్ పోచమ్మమైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. పరోక్షంగా ఆయన పార్టీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం పార్టీవర్గాల్లో కలకలం రేపింది. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో స్తబ్దత కనిపిస్తున్నా.. కొండా మురళి వ్యాఖ్యలతో ఒక్కసారిగా రచ్చమొదలైంది. ఈ వ్యాఖ్యలపై కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి గాని స్పందించకపోగా, వారి అనుచరులు సైతం మౌనం వహించారు. పార్టీలో తీవ్ర సంచలనంగా మారిన కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానం సీనియర్ నాయకుల ద్వారా ఆరా తీసినట్లు సమాచారం.

మాజీ టీడీపీ నేతలే లక్ష్యంగా...

ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య కొంతకాలంగా అంతర్గత కలహాలు సాగుతున్నాయి. ప్రధానంగా మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య గతంలోనూ పరస్పర ఆరోపణలకు సంబంధించిన ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరలైంది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో కొందరు ఎమ్మెల్యేలు కొండా సురేఖకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారన్న ప్రచారం జరిగింది. ఇందులో ప్రధానంగా గతంలో టీడీపీలో పనిచేసి.. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న కొందరు ఎమ్మెల్యేలు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని కూడా కొండా సురేఖ దంపతులు చాలాసార్లు తమ అనుచరులతో వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కొండా మురళీధర్‌రావు గురువారం పోచమ్మమైదాన్ సభలో కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేయడం కలకలంగా మారింది. 'కను బొమ్మలు లేని నాయకుడు టీడీపీని భ్రష్టు పట్టించి.. చంద్రబాబును ఓడించి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో నాటి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ తిష్ట వేశాడన్న' కొండా మురళీధర్‌రావు... '75 ఏళ్ల దరిద్రుడు, ముసలోడు ఎన్నికలకు ముందు మా వద్దకు వచ్చి మా కాళ్లు పట్టుకొని ఈసారి సీటు నాకు వదిలిపెట్టమని ప్రాధేయపడితే మా మద్దతుతో పరకాల ఎమ్మెల్యే అయ్యాడు' అని ఇద్దరిపై ఘాటైన ఆరోపణలు చేయడం రాజకీయవర్గాల్లో దుమారం రేపుతోంది.

గురువారం ఉదంతంపై అధిష్టానం ఆరా...

వరంగల్ కాంగ్రెస్‌లో దుమారం రేపిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో ఇటీవలి పరిణామాలపై ఓ వైపు ప్రభుత్వ ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు ఇప్పటికే తెప్పించుకున్న ప్రభుత్వ పెద్దలు.. పార్టీ సీనియర్‌ల ద్వారా 'వరంగల్‌లో అసలేం జరుగుతోంది'ని ఆరా తీసినట్లు అత్యంత విశ్వసనీయవర్గాల సమాచారం. గురువారం రాత్రి కూడా ఉమ్మడి వరంగల్‌కు చెందిన నలుగురు సీనియర్ నాయకులతో టీపీసీసీ పెద్దలు మాట్లాడినట్లు తెలిసింది. అలాగే, గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలతో కూడా రాష్ట్ర పార్టీ బాధ్యులు ఒకరు మాట్లాడినట్లు సమాచారం. త్వరలోనే ఉమ్మడి వరంగల్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలను హైదరాబాద్‌కు పిలిచి మాట్లాడే అవకాశం ఉందని కూడా పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

ఆర్ట్స్ కాలేజీ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, తదితరులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను గురువారం కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ కళాశాలలో విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,236మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 620 మంది (50.16శాతం) ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 927మంది విద్యార్థులు హాజరుకాగా 540 మంది ఉత్తీర్ణత(58.25శాతం) సాధించారు. అలాగే, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 742 మంది విద్యార్థులు హాజరుకాగా 582 మంది (78.44శాతం) ఉత్తీర్ణత సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి సుధీర్, గిరిప్రసాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల ఆందోళన

- ధర వ్యత్యాసంతో వ్యాపారులపై అన్నదాతల అసహనం
- సర్దిచెప్పిన మార్కెట్ అధికారులు
- మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన కాంటాలు

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్రంలోని ఇతర మార్కెట్లలో పసుపు క్వింటాల్‌కు ధర రూ. 12,500 పలుకుతుండగా, వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో రూ. 10వేల చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. ధర పెంచే వరకూ అమ్మబోమని తేల్చిచెప్పారు. దీంతో కాంటాలు నిలిచాయి. వ్యాపారులు తమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారులు చొరవ చూపించినా రైతులు అంగీకరించలేదు. చివరకు మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి జోక్యం చేసుకుని వ్యాపారులతో చర్చలు జరపగా, క్వాలిటీ పసుపునకే ఎక్కువ ధర చెల్లిస్తామని, లేనిపక్షంలో చెల్లించమని పేర్కొన్నారు. అనంతరం కార్యదర్శి రైతులతో మాట్లాడి సరైన ధరలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కాంటాలు ప్రారంభమయ్యాయి.



మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

సీసీఐ కొనుగోళ్ల విధానం కొనసాగించాలి

- వరంగల్ చాంబర్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

వరంగల్ చౌరస్తా : ప్రస్తుతం రాష్ట్రంలో సీసీఐ ద్వారా కొనుగోలు జరుపుతున్న విధానంతోనే పత్తి రైతులకు మేలు చేకూరుతుందని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కాంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి అన్నారు. ఢిల్లీలోని నీతి ఆయోగ్ భవన్‌లో గురువారం 'బహిరంగ మార్కెట్‌లో పత్తికి మార్కెట్ ధర, కనీస మద్దతు కంటే తక్కువ ధరలు పలుకుతున్న వ్యత్యాసాలు' అనే అంశంపై జరిగిన సదస్సుకు వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మనీష్ మల్పానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం 2025–26 కాటన్ సీజన్‌లో తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టి స్కీం అమలులో ఎదురయ్యే సమస్యలపై రవీందర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్లకు అవసరమైన సదుపాయాలు, రెగ్యులేటెడ్ మార్కెట్లలో పత్తి నాణ్యత, బహిరంగ మార్కెట్‌లోని ధరలను నిర్ధారించడానికి ఎలాంటి ప్రత్యేక వ్యవస్థలు లేవన్నారు. అందుకే ప్రస్తుతం రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరుపుతున్న విధానమే రైతులకు మేలు చేకూరుతుందన్నారు. పత్తి కొనుగోళ్లలో కనీస మద్దతు కంటే తక్కువ ధర పలికితే ఆ వ్యత్యాసపు ధరను నేరుగా రైతులకు చెల్లించడానికి కేంద్రం ప్రభుత్వం ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీంను పైలట్ ప్రాజెక్టు కింద వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు ప్రకటించినట్లు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రిత్వ శాఖ ఫైనాన్స్ డైరెక్టర్ పవన్ కుమార్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ జాయింట్ సెక్రటరీ లలిత్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో రాష్ట్ర కాటన్ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

అడవి నుంచి.. పుడమి తల్లి ఒడికి

నేడు మావోయిస్టు నేత గాజర్ల రవి అంత్యక్రియలు

- స్వగ్రామం వెలిశాలలో ఆయన జ్ఞాపకార్థం వెలిసిన ఫ్లెక్సీలు
- చివరి చూపు కోసం గ్రామస్తుల ఎదురుచూపు

టేకుమట్ల: గాజర్ల రవి.. పెత్తందార్లు, దొరల అరాచకాల నుంచి పీడిత ప్రజల విముక్తి కోసం మూడు దశాబ్దాలకు పైగా మావోయిస్టు సానుభూతిపరుడిగా, విద్యార్థి యూనియన్ నాయకుడిగా ఉద్యమంలోకి అడుగు పెట్టి దళ కమాండర్ బాధ్యతలు చేపట్టాడు. నాయకత్వ లక్షణాలు పునికి పుచ్చుకుని అనతి కాలంలోనే నార్త్ తెలంగాణ డివిజన్ కమిటీకి ఎన్నికై కేంద్ర కమిటీ సభ్యుడిగా, స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా కీలక బాధ్యతలు తీసుకుని ఉద్యమంలో నూతన ఒరవడికి నాంది పలికాడు. ఎన్నో కీలక ఆపరేషన్లు విజయవంతంగా చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి 1992లో అడవి బాట పట్టాడు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగాడు.

ఉద్యమాలే ఊపిరిగా..

కుటుంబ సభ్యుల కన్నా ఉద్యమాలే ఊపిరిగా, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా మూడు దశాబ్దాలుగా అడవి తల్లి ఒడిలో కాలం గడిపాడు. తల్లిదండ్రులను సైతం కాదని అడవి తల్లి చెంతకు చేరిన గాజర్ల రవి ఉద్యమ ప్రస్థానం బుధవారంతో ముగియడంతో శుక్రవారం పుడమి తల్లి ఒడికి చేరనున్నాడనని నాటి ఉద్యమకారులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. రవి జ్ఞాపకార్థం వెలిశాలతోపాటు, పలు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

చివరి చూపు కోసం ఎదురుచూపు..

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత గాజర్ల రవి అలియాస్ గణేశ్ మృతి చెందాడనే సమాచారం సోషల్‌మీడియాలో దావానంలా వ్యాపించడంతో వెలిశాల ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రెండు రోజులుగా గాజర్ల రవి చివరి చూపు కోసం జిల్లా వ్యాప్తంగా ఎదురు చూస్తున్నారు. గురువారం రాత్రి రంపచోడవరంలో పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో సోదరులు గాజర్ల సమ్మయ్య, అశోక్.. రవి పార్థివదేహాన్ని స్వగ్రామం వెలిశాలకు తీసుకురానున్నారు. కాగా, బుధవారం నుంచే వెలిశాలలో పోలీసులు రెక్కీ నిర్వహిస్తున్నారు.



వెలిశాలలో గ్రామస్తులు

చర్చల సమయంలో చివరిగా చూశా..



2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు మావోయిస్టులను చర్చలకు పిలువగా వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి రవ(రవి)న్న చర్చల ప్రతినిధిగా వస్తున్నాడని తెలిసి వెళ్లా. ఎంతో మంది ప్రజలు హాజరైన కార్యక్రమంలో దూరం నుంచి చూశా. ఇప్పుడు విగత జీవిగా చూస్తామని అనుకోలేదు.

-అచ్చె లచ్చన్న, మాజీ సర్పంచ్, రామకిష్టాపూర్(వి)

అన్నకు తమ్ముడి శఠగోపం

- వ్యాపారంలో రూ.1. 37 కోట్లు ముంచిన తమ్ముడు
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

వరంగల్ చౌరస్తా : అన్నకు తమ్ముడు శఠగోపం పెట్టాడు. నమ్మి క్యాష్ కౌంటర్‌పై కూర్చోబెట్టినందుకు రూ.1.37 కోట్లు స్వాహా చేశాడు. మోసం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీనిపై చాంబర్ ప్రతినిధులు, పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు (అన్న) చల్లా సాంబలింగం విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు గురువారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను, తన తమ్ముడు సంపత్ కలిసి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో 2016 నుంచి కేశవ ట్రేడర్స్ పేరుతో మిర్చి వ్యాపారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్రమంలో తాను బయట విషయాలు చూసుకుంటుండగా తన తమ్ముడు సంపత్ క్యాష్ కౌంటర్ పై కూర్చుని ఆర్థిక లావాదేవీలు చూసేవాడన్నారు. ఈ క్రమంలో రూ.1.37 కోట్లు మోసం చేశారని పేర్కొన్నారు. తనకు రావాల్సిన డబ్బులు అడిగితే ఇవ్వనని.. పైగా డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను చాంబర్ ఆఫ్ కామర్స్ జాయింట్ సెక్రటరీ చక్రపాణి వద్దకు వెళ్లగా అతడు పంచాయితీ నిర్వహించి తనకు రావాల్సిన డబ్బును చెల్లించాలని తన తమ్ముడికి చెప్పారన్నారు. అయితే తన తమ్ముడు చెల్లించకపోవడంతో మూడు నెలల క్రితం ఏనుమాముల పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా చాంబర్ ప్రతినిధులు, పోలీసులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు చల్లా సాంబలింగం

నేడు కేయూలో ఉద్యోగ సంఘాల ఎన్నికలు

- ముగిసిన ప్రచార హోరు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్‌జీఓ ఎంప్లాయీస్, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీ ప్రిన్సిపల్ కార్యాలయం, పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ , ఖమ్మం పీజీ కాలేజీ, భద్రాద్రి కొత్తగూడెం కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈనెల 21న ఉదయం 11 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభం కానుంది. ఆ తర్వాత ఫలితాలు వెల్లడిస్తారు.

క్యాంపస్‌లో సందడే.. సందడి

రెండు అసోసియేషన్ల ఎన్నికల నేపథ్యంలో ఆయా ఉద్యోగుల ప్రచారంతో క్యాంపస్‌లో కొద్ది రోజులుగా సందడి నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. కేయూ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బి.నవీన్ కుమార్, జి. నిరంజన్ పోటీపడుతున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎండి. యూనస్, పి. భాస్కర్, జనరల్ సెక్రటరీ పదవికి వల్లాల తిరుపతి, సయ్యద్ అక్రమ్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (జనరల్)కు ఎ. సతీశ్‌బాబు, బి. రాజు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్) పదవికి బి. కృష్ణవేణి, గౌసియాబేగం, దేవమ్మ, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్)కు జి. మధుకర్, టి. ప్రభాకర్, పి. సుశీల్, ట్రెజరరీగా సీహెచ్. ప్రవీణ్‌కుమార్, టి. దామోదర్ పోటీపడుతున్నారు. 222 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు.

కేయూ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్..

కాకతీయ యూనివర్సిటీ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పి. గుమ్మయ్య, ఎండి. నిజాముద్దీన్ పోటీపడుతున్నారు.జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్(జనరల్) పదవికి ఎండి. వలిపాషా, టి. రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్) పదవికి ఎస్. ఐలయ్య, పి. వేణు, ట్రెజరరీ పదవికి టి.తరుమల్ శ్రీనివాస్‌సింగ్, పి. రామనాథం పోటీపడుతున్నారు. 79 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోబోతున్నారు.

ఇప్పటికే ముగ్గురు ఏకగ్రీవం..

క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీ పదవికి బొక్క మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పి. అంకూస్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్)గా జి. మల్లికాంబ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విధితమే.

పోటాపోటీ ప్రచారం..

ఈ రెండు అసోసియేషన్ల ఎన్నికల్లో పోటీపడుతున్న వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం చేశారు. అన్ని విభాగాలు, కాలేజీల్లో తిరుగుతూ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం సాయంత్రం ప్రచారం ముగిసింది. ఎన్నికైన వారు రెండు సంవత్సరాలు ఆ పదవుల్లో ఉంటారు.

'జంపన్న' సుందరీకరణ ..

- వాగు అభివృద్ధి పనులకు నిధులు
- రూ. 5 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- ఆహ్లాదకరంగా మారనున్న స్నానఘట్టాలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్‌ఎస్ తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సమయంలో కోట్లాది మంది పుణ్యస్నానాలు ఆచరించే జంపన్న వాగును సుందరీకరించనున్నారు. భక్తులకు మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ. 5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ నిధులతో వాగును అభివృద్ధి చేయనున్నారు. మంత్రి సీతక్క చొరవ మేరకు జంపన్న వాగుపై రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసినట్లు సమాచారం.

జంపన్న వాగు ఒడ్డున పార్కులు, బెంచీల ఏర్పాటు..

జంపన్న వాగుపై రెండు వైపులా స్నాన ఘట్టాలు నిర్మించారు. జాతర సమయంలో భక్తులు స్నాన ఘట్టాలపై అమర్చిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ద్వారా స్నానాలు ఆచరిస్తారు. అయితే వాగుపై స్నాన ఘట్టాలు తప్ప కొత్తదనం ఏమీ కనిపించదు. ఈ నేపథ్యంలో ఈసారి మహాజాతర నాటికి స్నాన ఘట్టాల వద్ద భక్తులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పార్కులు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా ఒకటి రెండు కాటేజీలను కూడా నిర్మించనున్నారు. జాతర సమయంలో భక్తులు ఎండ, వర్షం నుంచి ఉపశమనం పొందేందుకు జంపన్న వాగు ఒడ్డున షెడ్లు కూడా నిర్మించే అవకాశం ఉంది. ఫలితంగా సుందరీకరణతో ఈసారి జాతరకు వచ్చే భక్తులకు జంపన్న వాగు ఆకర్షణీయంగా కనిపించనుంది.



మేడారంలోని జంపన్న వాగు

మంత్రి సీతక్క చొరవతో..

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మేడారంలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా జంపన్న వాగు భక్తులకు ఆకర్షణీయంగా కనిపించాలనే సంకల్పంతో సుందరీకరణ పనులకు నిధుల మంజూరుకు కృషి చేసినట్లు తెలుస్తోంది. జంపన్న వాగులో ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత మహాజాతరలోనే సమ్మక్క–సారలమ్మ చిహ్నాలుగా వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారు. అయితే ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో ఈసారి మహాజాతర వరకు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈవిషయంపై టూరిజం కార్పొరేషన్ ఏఈ విజయకుమార్‌ను వివరణ అడగగా జంపన్నవాగులో రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తనకు సమాచారం తెలియదన్నారు. నేటి(శుక్రవారం) మధ్యాహ్నం కల్లా వివరాలు తెలుస్తాయన్నారు.

247 క్యూసెక్కుల నీరు పంపింగ్

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని దేవాదుల ఇన్‌టెక్ వెల్ వద్ద ఒక మోటారు ద్వారా పంపింగ్ నిలిపివేశారు. పంపింగ్ వద్ద మూడు ఫేజ్‌లలో పది మోటార్లు ఉండగా అందులో సెకండ్ ఫేజ్‌లో ఉన్న రెండు మోటార్లను ఆన్ చేసి 494 క్యూసెక్కుల నీటిని దిగువకు బుధవారం వరకు పంపింగ్ చేశారు. ఈ క్రమంలో గురువారం అందులోని ఒక మోటారును ఆఫ్ చేసి మరో మోటారు ద్వారా 247 క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు పంపింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం దేవాదుల వద్ద 73.20 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోంది. దీనితో పాటు తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద ఎగువ నుంచి 5,800 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో బ్యారేజీ వద్ద రెండు గేట్లను ఎత్తి 6,000క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 73.45మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది



దేవాదుల వద్ద మోటార్లు

జఫర్‌గఢ్‌లో ఎలుగుబంట్ల సంచారం

- భయాందోళనలో గ్రామస్తులు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌లో రెండు రోజుల నుంచి ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. జఫర్‌గఢ్ చుట్టూ గుట్టలు ఉండడంతో ఎలుగుబంట్లు అందులో నివాసం ఉంటున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బయన్నగుట్టల సమీపంలో దమ్మన్నపేటకు వెళ్లే రహదారిపై ఎలుగుబంటి తన పిల్లలతో వెళ్తుండగా స్థానికులు చూసి భయాందోళనకు గురయ్యారు. గురువారం కూడా జఫర్‌గఢ్ శివారులోని పల్లె పకృతి వనంలో ఎలుగుబంటి తన పిల్లలతో కలిసి ఉంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు ఎలుగుబంటిని అక్కడి నుంచి తరిమికొట్టడంతో పంట పొలాల మీదుగా మసీదు బండ నుంచి వెళ్లింది. దీంతో స్థానికులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, కొన్నేళ్ల నుంచి గుట్టలపై ఎలుగుబంట్లు నివాసం ఉంటూ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండడంతో గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల బంధించి వేరే అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పల్లె ప్రకృతి వనం నుంచి వెళ్తున్న ఎలుగుబంటి